నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం | జులై 29, 2024 | www.navatelangana.com

తొలి ఫైట్‌లో నిఖత్ విజయం

- 1వ తేదీనా చైనా క్రీడాకారిణితో పోరు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఒలంపిక్స్‌లో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ తన తొలి బౌట్‌లో విజయం సాధించింది. బాక్సింగ్ 50 కేజీల విభాగంలో ఆదివారం జర్మనీ క్రీడాకారిని మాక్సీ కరినా క్లోట్జర్‌పై విజయం సాధించింది. నార్త్ పారిస్ ఎరినాలో జరిగిన 32 రౌండ్‌ల పోటీలో గెలుపొందారు. ఆగస్టు 1వ తేదీనా(గురువారం) చైనాకు చెందిన వుయు తో తలపడనున్నారు.

సౌత్ క్యాంపస్‌లో 30న ప్లేస్‌మెంట్ డ్రైవ్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణంలో జియో ఇన్ఫర్మేషన్ విభాగంలో ఈనెల 30వ తేదీ నాడు జియో ఇన్ఫర్మేషన్ పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుత సంవత్సరం చదువుతున్న జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థుల కు క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. హైదరాబాదులోని ట్రిబుల్ ఐటీ గచ్చిబౌలి ప్రాంగణంలోని క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ వారు జిఐఎస్ అనలిస్ట్ ఉద్యోగాల కోసం అప్లై చేసుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు క్యాంపస్ ప్లేస్ మెంట్ డైరెక్టర్ డాక్టర్. పాత నాగరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమానికి కో- ఆర్డినేటర్స్ గా డాక్టర్ టి ప్రతిజ్ఞ, డాక్టర్ ఎస్ నారాయణ ఉన్నారు.

ఊరంత వేడుక

- నగరంలో వైభవంగా ఊరపండుగ
- గ్రామ దేవతలకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠాపన
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు
- పట్నంకు పల్లెశోభ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ



ఊరపండుగకు హాజరైన నగరవాసులు





తొట్లెకింద కూర్చునేందుకు బారులు తీరిన ప్రజలు

ఏటా ఆషాఢమాసంలో నిర్వహించే ఊర పండగ నిజామాబాద్ నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంటలు పండాలని సుఖ సంతోషాలతో ఉండాలని దుష్ట శక్తులు దరిచేర వద్దని వేడుకుంటూ నగర ప్రజలు గ్రామ దేవతలను పూజించారు. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల జాతర రోజునే పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఊర పండుగలో భాగంగా గ్రామదేవతలను ఉదయం నుంచి ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నగరం భక్తితో పులకరించి ఆధ్యాత్మిక శోభను సంతరించు కుంది.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతల ఊరేగింపు

ఊర పండగ నిర్వహణ కమిటీ అయిన సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ్ ఆలయం శారదాంబా గద్దె వద్ద గ్రామదేవతలను ఉంచి పసుపు కుంకుమ చెవి పోగులు ఆభరణాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. సర్వ సమాజ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, కార్యదర్శి బంటు రాజేశ్వర్ కన్వీనర్ రామర్తి గంగాధర్ కుల సంఘాల పెద్దలు పూజలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామదేవతల ఊరేగింపు గాజుల పేట్ చౌరస్తా మీదుగా పెద్ద బజార్ చౌరస్తా వరకు చేరుకుంది. అడుగడుగునా భక్తులు తొట్టెల కింది నుంచి వెళ్లాలని బారులు తీరారు. పెద్ద బజార్ చౌరస్తా నుంచి రెండు బృందాలుగా విడిపోయి డప్పులు, పోతరాజుల విన్యాసాలు, మహిళల పూనకాలతో ఒక బృందం పొడలమ్మ, నల్ల పోచమ్మ, ఆడెల్లి పోచమ్మ, పెద్దమ్మ, పులి రాట్నం ఆసు తొట్లేలతో ఊరేగింపు దుబ్బ వైపు వెళ్ళింది. రెండో బృందం సిర్నాపల్లి గడి, గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక నగర్ ఐదు చేతుల పోచమ్మ మత్తడి పోచమ్మ మహాలక్ష్మమ్మలతో వెళ్ళింది. గాజుల్‌పేట్ వివేకానంద చౌరస్తా వద్ద సరిని పంపిణీ చేశారు. సరి కోసం భక్తులు ఎగబడ్డారు. సరిని నాలుగు గుల్లలుగా విభజించారు. ఒక గుల్ల దుబ్బ వైపు, రెండవది వినాయక్‌నగర్, మూడవది ఎల్లమ్మ గుట్ట, నాలుగవది కంఠేశ్వర్ ప్రాంతాలకు సరి చల్లుకుంటూ వెళ్లారు.



ఎమ్మెల్యే ధన్‌పాల్ పూజలు

ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

ఊర పండుగ సందర్భంగా వాడవాడలా యువకులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. అమ్మవారి గద్దెల వద్ద పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. యువత కేకలు వేస్తూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

నిజామాబాద్‌సిటీ : ఇందూరు నగరంలోని ఊర పండుగ సందర్భంగా నగర అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఉండాలని ఆకాంక్షించారు . సర్వ సమాజ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పాడిపంటలు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకుంటూ ఏటా ఆషాడమాసంలో ఊర పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది అన్నారు. టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నిజామాబాద్ నగరంలోని మహిళలు వారి కుటుంబ సభ్యులు, యువకులు తోపాటు బిజెపి కార్పొరేటర్లు మమత ఇల్లెందుల ప్రభాకర్ , సీనియర్ నాయకులు బెల్లాల్ పోతన్న, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, మల్లేష్ యాదవ్, సర్వ సమాజ్ కమిటీ కో కన్వీనర్ ఆదే ప్రవీణ్, వివిధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊరపండగకు పోలీస్ బందోబస్తు

నగరంలో ఊరపండుగ నిర్వహించిన నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ తరపున బందోబస్తు నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్ కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. నగరంలో ప్రధాన కూడళ్ల వద్ద, ప్రధాన ఆలయాల వద్ద పోలీసులు నిఘాను ఏర్పాటు చేశారు. ఊరేగింపు నిర్వహించిన మార్గం గుండా నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ, తో పాటు నిజామాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, నగర సిఐ నరహరి, సిఐలు, ఎస్ఐలు కానిస్టేబుళ్లు పోలీస్ సిబ్బంది మహిళ పోలీసులు పెద్ద సంఖ్యలో ర్యాలీ గుండ బందోబస్తులో పాల్గొన్నారు. బందోబస్తుకు సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు పోలీస్ శాఖ తరపున తెలియజేశారు.



ఊరేగింపుగా తీసుకెళ్తున్న తొట్టెలు



పోతరాజుల విన్యాసాలు

ప్రజాసమస్యల పరిష్కారంలో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ఎన్నికల హామీలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపుల్లేవ్
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-బోధన్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యా యని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. ఆదివారం బోధన్ పట్టణంలో బోధన్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రమేశ్‌బాబు హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఎన్నికలలో ఇచ్చిన హామీలకు సంబంధించి పూర్తి పథకాలకు బడ్జెట్‌లో నిధులు విడుదల చేయటంలో నిర్లక్ష్యం చేశాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు అమలు చేయాలని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో 6 పథకాలకు సంబంధించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీ ప్రకారం వితంతులకు, వద్దులకు నెలకు 4000/- పెన్షన్, వికలాంగులకు నెలకు 6000/- పెన్షన్ మంజూరి చెయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి ఇల్లు లేని ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయలు, వ్యవసాయ కూలీలకు కూలి బందు సంవత్సరానికి 12000/- రైతులకు రుణమాఫీ ఏకకాలంలో అందరికీ ఒకేసారి రెండు లక్షల రూపాయలు, ఇంటి స్థలాలు లేని వారందరికీ ఇంటి స్థలాలను, ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందించాల న్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజు 600/- వందల రూపాయలు, సంవత్సరానికి 210 దినాలు పంచాలని, అసంఘటిత రంగాల కార్మికులకు, స్కీం వర్కర్లకు నెలకు ఇస్తామన్న 18000/- వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రతి మహిళకు నెలకు ప్రతి కుటుంబానికి 2500/- జీవన భతి వెంటనే అమలు చేయాలని, బీడీ కార్మికులకు ప్రతి నెల 4000/- జీవన భతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఏషాల గంగాధర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జమ్మిశెట్టి శంకర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు గంగాధరప్ప, పార్టీ బాన్సువాడ, వర్ని, కోటగిరి ఏరియా కార్యదర్శి నన్నే సాబ్, ఏరియా కమిటీ సభ్యులు కుప్పిర్యాల బాలయ్య, సంఘం గంగాధర్, దండు సాయిలు, దాసి గోపి, షేక్ నజీర్, గైని రాములు, సింగాడి లక్ష్మణ్, తోకల దత్తు, పల్లికొండ చింటూ, పత్రి ఎల్లప్ప , పేట పోశెట్టి, మద్దెల గంగారామ్, శివలింగం, అజీమ్, దండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ నిధులు

రూ.9 కోట్లపై విచారణ చేస్తాం

స్పందన

- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదికారి వాణి
- నవతెలంగాణ కథనం నేపథ్యంలో విచారణకు ఆదేశాలు జారీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో సకాలంలో బిల్లులు ఎంట్రీ చేయకపోవడంతో రెండేండ్లలో సుమారు రూ.9 కోట్ల మేర నష్ట జరిగినట్టు నవతెలంగాణలో శనివారం కథనం ప్రచురించిన విషయం విధితమే. ఈ కథనంపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదికారి వాణి స్పందించారు. తొమ్మిది కోట్ల నష్టం ఎవరి ద్వారా జరిగింది, వారు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏ హోదాలో అయినా ఉన్నారా, వారు ఏ విధంగా ఈ తప్పిదములకు పాల్పడ్డారు తదితర అంశాలపై విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. తప్పిదాల వల్ల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎంత మేరకు నష్టం జరిగింది అనే అంశాలను పరిగణలోకి తీసుకొని, జరిగిన తప్పిదాన్ని ఏ విధంగా భర్తీ చేయాలి అనే అంశాలను లెక్కలోకి తీసుకుంటూ, ఖచ్చితమైన ప్రభుత్వ నియమ నిబంధనలతో విచారణ చేపట్టి ప్రభుత్వం జనరల్ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ కి నష్టాన్ని విచారణలో తేలిన తర్వాత సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి విచారణ చేపట్టడమే తక్షణ కర్తవ్యం అని, విచారణ చేపట్టి చర్యలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

కంట్రోల్ రూం.. నామ్‌కే వాస్తే

- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- సంబంధిత శాఖకు సమాచారం ఇచ్చామంటూ దాటవేత



కనీసం నడిచివెళ్లేందుకు వీలు లేకుండా పూర్తిగా బురదమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

వర్షాల వల్ల కలిగే నష్టాలు, ఇక్కట్లు తొలగించేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఫోన్ చేస్తే సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటారని ప్రజలు భావించారు. కానీ కంట్రోల్ రూం పని నామ్‌కే వాస్తేగా మారిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే 'ఒకే. మీ సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం' అని చెప్తున్నారు. కానీ అధికారులు రారు.. చర్యలు చేపట్టరు. పనులు చేపడతారేమోనని ప్రజలు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.

నగరంలోని 7వ డివిజన్‌లో రోటరీనగర్ రోడ్ నెం.6 పూర్తిగా మట్టి రోడ్డు. మాజీ కార్పోరేట్ ఆకులపాపయ్య ఇంటిపక్కన నుంచి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు గుంతలమయంగా మారి నీరు నిలిచాయి. వాటిల్లో నుంచి పెద్దపెద్ద లారీలు, టిప్పర్లువెళ్తుండటంతో గుంతలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో బైక్‌లపై వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసినా ఇప్పటి వరకు వచ్చి తనిఖీ చేసి మొరం వేసి చదును చేయలేదు. కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేస్తే సత్వరమే స్పందించి పనులు చేపడతారని ఆశించిన స్థానికులకు ఆశాభంగం కలిగింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫిర్యాదులపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అసలే మట్టి రోడ్డు.. గుంతల్లో నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం

ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎంపీ, ఎమ్మెలే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్లమెంట్, అసెంబ్లీలలో గళం విప్పి ఎంపీ,ఎమ్మెల్యే నిధులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంపీ, ఎమ్మెల్యే కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన 113 మంది లబ్దిదారులకు రూ.50 లక్షల విలువ గల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని వెళ్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాల పండుగలో బలప్రదర్శన

- బాన్సువాడలో ఎవరికి వారు యమున తీరు

నవతెలంగాణ-వర్ని



బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూపు బలప్రదర్శనలు జోరందుకున్నా యి. బోనాల పండుగ సందర్భంగా బలప్రదర్శ నలో ఎవరికి వారు యమున తీరుగా ఉండటంతో కార్యకర్తలు అయోమయానికి గురైయ్యారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు ఒక మండలంలో పర్యటించగా, ఏనుగు రవీందర్‌రెడ్డి మరో మండటంలో పర్యటించారు. బోనాలు ఎత్తుకొని గ్రామాలలో పండుగలు జరిగే చోట ఎవరికి వారే కనిపించడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురైయ్యారు. ఒకే కాంగ్రెస్ పార్టీలో ఇరు వర్గాల నాయకులు ఇలా పోటాపోటీగా ప్రదర్శనలు చేయడం.. భారీ కాన్వాయ్‌లతో మండలాల్లో తిరగడంతో మండల స్థాయి, గ్రామ స్థాయి కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు తలనొప్పిగా మారింది.

అర్బన్‌లో 'ఆ నలుగురు'



- ఎవరికి వారే తామే ముఖ్యులమంటూ ప్రచారం
- అయోమయంలో కార్యకర్తలు, ప్రజలు
- అధికారులకు తప్పని తిప్పలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంట్ ఎన్నికల మజిలీ పూర్తయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పాలనపై దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలపై, గతంలో చేపట్టి నిలిచిన పనులు పూర్తి చేయడంపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో తమ సమస్యలు విన్నవించుకునేందుకు అర్బన్ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వింత అనుభవం ఎదురవుతుంది. ఎవరిని వెళ్లి కలిస్తే పనులు చేపడతారో, సమస్యలు పరిష్కరిస్తారో తెలియక గందగోళానికి గురవు తున్నారు. తనకు త్వరలో మంత్రి పదవి వరించనుందని, జిల్లా వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షిస్తానని ఓ ఎమ్మెల్యే ప్రకటించుకుంటుండగా, రూరల్ ఏరియాలో సగం ఓట్లు అర్బన్‌లో ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధిపై ప్రజలు, అధికారులు తనవద్దకే రావాలంటూ మరో ఎమ్మెల్యే ప్రకటించారు. కాగా గతంలో అర్బన్‌లో పోటీ చేసినప్పటికీ అధిష్టానం సూచనతో ఈసారి పోటీలో లేనని, అయినా పదవి ఉంది కాబట్టి అర్బన్‌లో తానే కీలకం అంటూ మరోనాయకులు ప్రకటించుకున్నారు. అయితే అర్బన్ నుంచి తాజాగా పోటీచేసిన సీనియర్ నాయకులు ఏకంగా ప్రత్యేక ఆఫీస్‌నే ప్రారంభించగా.. అర్బన్ ఇన్‌చార్జి తానేనంటు ప్రకటించుకోవడం కొసమెరుపు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు, అధికారులు ఎవరిని కలవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

నిజామాబాద్ నగర ప్రజల సమస్యలను పరిష్కరించాలంటే అంత అయోమయంగా, అస్తవ్యస్తంగా తయారైందని నగర ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందుల పాల్పడుతున్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు 6 గ్యారంటీల పథకాలలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గృహ లక్ష్మీ వంటి పథకాలు అందుకొని ప్రజాలు ఎవరి దగ్గర వెళ్తే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయో తెలియడం లేదని గందరగోళానికి గురవుతున్నారు.

బోధన్ నుంచి గెలుపొందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డికి త్వరలో మంత్రి పదవి రానున్నట్టు ప్రచారం జరుగుతుంది. అనుకున్నది అనుకున్నట్టయితే ఆయనకు హోం మంత్రి పదవి వరించనున్నట్టు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తన ఆధ్వర్యంలో జరగాలని, ఏమున్నా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు, కార్యకర్తలకు సూచించినట్టు సమాచారం.

కాగా గతంలోఅర్బన్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మహేశ్‌కుమార్ గౌడ్.. ఈసారి పార్టీ ఆదేశానుసారం పోటీ విరమించుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి కేటాయించింది. పీసీసీ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో అర్బన్‌కు సంబంధించి ఏ విషయమైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించినట్టు వినికిడి. ఇటీవల మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్బన్‌లో జరగుతున్న అభివృద్ధి పనులు, ఇతరాత్ర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

షబ్బీర్ అలీ పార్టీ ఆదేశానుసారం తన కామారెడ్డి స్థానాన్ని వదిలి.. నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమిపాలైయ్యారు. దీంతో ఆయనను ప్రభుత్వ సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. షబ్బీర్ సైతం అటు కామారెడ్డితో పాటు ఇటు నిజామాబాద్ అర్బన్‌లో పాగా వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అర్బన్‌లో పోటీ చేసినందున పార్టీ అర్బన్ ఇన్‌చార్జిగా తానే ఉంటానని, ఏమైనా పనులు కాకపోతే తనను కలవాలంటూ నిజామాబాద్‌లో ఏకంగా ఒక కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు.

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం.. రూరల్ ఓట్లు సగం అర్బన్ చుట్టుపక్కలే ఉన్నాయని, వారి సమస్యలను నేనే పరిష్కరిస్తానని ప్రకటించుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు, అధికారులు తన వద్దకే రావాలి అంటూ అధికారులకు కార్యకర్తలకు సూచించినట్టు సమాచారం.

నలుగురిలో నారయణ అన్న చందంగా అర్బన్‌లో పాలన నడుస్తోందని, ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేస్తుండటంతో ఎవరికి చెప్తే పరిష్కారం అవుతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు ఏకమై ప్రజలకు న్యాయం చేకూరే విధంగా కలిసి కట్టుగా కృషి చేయాలని ప్రజలు, పార్టీ నాయకులు కోరుతున్నారు.

పోటాపోటీ సమావేశాలు

నలుగురి తీరు ఇలా ఉంటే అందులో ముగ్గురు ఇటీవల అధికారులతో పోటాపోటీ సమావేశాలు నిర్వహించడం గమనార్హం. తొలుత ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ మున్సిపల్ ఉద్యోగులతో, సిబ్బందితో సమావేశం నిర్వహించి అర్బన్‌లో పారిశుధ్య పనులు ఇతరాత్ర అభివృద్ధి పనులపై చర్చించారు. తదనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కాగా ప్రభుత్వ సలహాదారు హోదాలో షబ్బీర్‌అలీ సైతం మరోసారి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇలా ఎవరికి వారు తమ పట్టు నిలుపుకునేందుకు పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తుండటంతో అధికారులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

తుప్ప పడుతున్న చెత్తరిక్షాలు

నవతెలంగాణ-రెంజల్

గతంలో ప్రభుత్వాలు గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డ్‌కు తరలించడానికి లక్షలాది రూపాయల వ్యయంతో చెత్తరిక్షాలను మంజూరు చేసింది. ప్రస్తుతం అవి తుప్పుపట్టి మూలనపడ్డాయి. ప్రతి గ్రామపంచాయతీలోనున్న చెత్తారిక్షాలు ఇలాగే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లను ఉపయోగించడంతో ఈ చెత్త రిక్షాలు మూలనపడ్డాయి. అవి తప్పుపట్టి పనికి రాకుండా పోతున్నాయి.


మూలనపడి ఉన్న చెత్తరిక్షాలు

ఘనంగా గండి మైసమ్మ బోనాల పండుగ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో ఆదివారం గండి మైసమ్మ బోనాల పండుగను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురుస్తూ పాడిపంటల అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.


బోనాలతో తరలిన మహిళలు, గ్రామస్తులు

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-బోధన్/బాల్కొండ

ఆషాడమాసం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సాలూర, బోధన్ మండలంలో భక్తులు ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. అమ్దాపూర్ గ్రామంలో జగజ్జనని ఆలయానికి గ్రామస్థులు బోనాలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాలూర మండల కేంద్రంలో గ్రామస్థులు ఘనంగా బోనాల పండుగను చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు డప్పు సప్పుళ్లతో బోనాలు ఎత్తుకొని మహాలక్ష్మి ఆలయానికి తరలివెళ్లారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని కోరుతూ.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. బోనాల పండుగ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకటిపటేల్, ఉపాధ్యాయ నేత ఇల్తెపు శంకర్, సురేష్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్, అల్లె రమేష్, కర్ణం అశోక్‌బాబా, స్వామిగౌడ్, కే.జీ.గంగారాం, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, సరిడే సాయిలు, దండోర ఉద్యమ సీనియర్ నేత లింబూరి లక్ష్మణ్, నాగరాజు, కుల సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బోధన్ : సాలూరాలో బోనాల ఊరేగింపు


పోతరాజుల విన్యాసాలు

బాల్కొండ : మండల కేంద్రంలోని కిసాన్‌నగర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో పోచమ్మ మందిరానికి వెళ్లి నైవేద్యాలు, బోనాలు సమర్పించారు. గ్రామంలో ప్రజలు, పంటలు ఎలాంటి రోగాల బారిన పడకుండా క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బాల్కొండ : గ్రామ దేవతల వద్ద నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

కొరడా దెబ్బలు కొట్టించుకోవడం.. ఇదో మూఢ నమ్మకం..

నవతెలంగాణ-బోధన్

సంస్కృతి, సంప్రదాయాలతో జరుపుకునే పండుగలో కొంతమంది మూఢ భక్తులు తామేదో దేవుడిపై ఎంతో భక్తి ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. సాలూరా మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్థులు నిర్వహించిన బోనాల పండగ సందర్భంగా కొంతమంది యువకులు పోతరాజుల చేత కొరడా దెబ్బలు కొట్టించుకున్నారు. పోతరాజుల చేత కొరడాదెబ్బలు కొట్టించుకుంటే తమకు అంతా మంచే జరుగుతుందనే మూఢనమ్మకంతో ఇలా వ్యవహరించారు. చూసిన వారంతా ఇదేం మూఢభక్తి అంటూ పక్కకు జారుకున్నారు.



ఆపదొస్తే అండగా నిలుస్తాం


మాట్లాడుతున్న దళిత కళ్యాణ్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళిత కళ్యాణ్ సభ్యులకు ఏమైనా ఆపద వస్తే అండగా నిలుస్తామని దళిత కళ్యాణ్ సమితి జిల్లా అధ్యక్షులు దౌలచాక్రి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర గైక్వాడ్ తెలియజేశారు. ఆదివారం దళిత కళ్యాణ్ సమితి పంబౌడి (నాందేవ్‌వాడ) శాఖ అధ్యక్షురాలు కల్పనాబాయి సిరిసాటి కుమారుడు అఖిల్ అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని మనోరమ ఆస్పత్రిలో చేర్పించారు. ఆసుపత్రి డాక్టర్లు పరీక్షించిన అనంతరం పెద్దపేగుకు రంధ్రం పడిందని, అత్యవసరంగా సర్జరీ చేయాల్సి ఉందని చెప్పడంతో తల్లి కల్పనాబాయి తల్లడిల్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న దళిత కళ్యాణ్ సమితి జిల్లా శాఖ స్పందించి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యం చెప్పడంతో పాటు తమ వంతుగా కొంత ఆర్థికసాయాన్ని అధ్యక్షులు దౌలత్ చక్రి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర గైక్వాడ్ ఆధ్వర్యంలో రామారావ్ పట్టణ అధ్యక్షులు నవీన్, మనోహర్ రావు, మారుతి, శివాజీ, మదినే ప్రేమ్‌నాథ్, దావుని స్నేహలత, తదితరులు కలిసి ఆర్థికసాయం అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో దళిత కళ్యాణ్ సభ్యులకు ఏమైనా ఆపద వస్తే కళ్యాణ్ సమితి అండగా ఉంటామని అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్ర గైక్వాడ్ తెలియజేశారు.

వర్షాలకు ఇల్లు కూలిన బాధితులకు ఆర్థికసాయం


బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ముత్యాల సునీల్ కూమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మెండోరా మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలి నిరాశ్రయులైన పలువురు బాధితులకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన గోలి అమ్మాయి, చెన్న నర్సు, కంఠం దేవాయిల ఇల్లు భారీ వర్షాలకు కూలిపోవడంతో ఉన్న గూడును కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్నారు. ఈ విషయం కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తక్షణం ఆ ముగ్గురికి పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని వారికి అందించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులు ముగ్గురికి రూ.10వేల చొప్పున ఆర్థికసహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహాయం అందిస్తామని, నష్టాన్ని అంచనా వేసి నివేదించాలని సునీల్ కుమార్ ప్రభుత్వ అధికారులను కోరినట్లు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-పోతంగల్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 28, 2024లోపు కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు అర్హులని పేర్కొన్నారు. ఆగష్టు 5, 2024 వరకు చివరి తేదీ ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించే బీమా సౌకర్యం లేని ప్రతి రైతూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు వారు అర్హులని తెలిపారు.

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరి ధిలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 2001-2002 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహి ంచారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 23 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యారు ్థలు ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గురువుల నేర్పిన విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడ్డామని గురువుల స్థానం గొప్పదని పూర్వ విద్యార్థులు గురువులను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రైతులకూ
రుణాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-మోపాల్

రైతు రుణమాఫీ అయిన అసైన్డ్ భూముల రైతులకూ వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని కామ్రేడ్ రాజిరెడ్డి అధ్యక్షతన మండలంలోని తానాకుర్దు గ్రామంలోని దొడ్డి కొమురయ్య హాలులో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను రుణవిముక్తి చేయడానికి మొదటి దఫాగా లక్ష లోపు రుణాన్ని మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని అభినందిస్తూ అట్లాగే రెండు లక్షల వరకు ఉన్న రుణాన్ని ఎలాంటి మెలికలు పెట్టకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరారు. అట్లాగే గత ప్రభుత్వం చేసిన తప్పుల్లో భాగంగా గత 30-40 సంవత్సరాల నుంచి సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు ధరణిలో చూపెట్టకుండా ఆ భూములను కాజేయాలని చూసిందని వివరించారు. ఇలాంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో వచ్చిన అంశాలను అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు చేసుకుంటున్న పోడు రైతులకు అసైన్డ్ భూములు గాని మిగతా భూములను గాని పట్టా చేసి ఇస్తామని చెప్పిందని, కావున ఇప్పటికే పట్టాలున్న రైతులకు లక్షలోపు రుణాన్ని మాఫీ చేసిందని తెలిపారు. కానీ తిరిగి వారికి రుణాన్నివ్వడంలో బ్యాంకులు కోఆపరేటివ్ వ్యవస్థ నిర్లక్ష్యంగా చేస్తుందని విమర్శించారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాసుబుక్కులు ఉన్న రైతులందరికీ రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్ మాట్లాడుతూ.. రైతులకు రైతుభరోసా ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వడం లేదని, ఇప్పటికే రైతులు వరినాట్లు వేసుకొని అప్పుల కోసం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని, ఎలాంటి మెలికలు లేకుండా అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు గంగారాం, సాయిలు, చిన్నారెడ్డి, ఎ.గంగారాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏజీపీ రవీందర్‌కు సన్మానం


ఏజిపిను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ సీనియర్ సివిల్ కోర్టులో ఏజీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొగ్గుల రవీందర్‌ను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు బీర్కూరు బుజ్జి మాట్లాడుతూ.. బోధన్ కోర్టులో ఏజీపీగా సేవలు అందించడానికి తమ సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల రవీందర్‌ను ఎంపిక చేయడం అభినందనీయమని అన్నారు. మున్నూరు కాపు సంఘంలోని అనేక మంది విద్యావంతులు అంచెలంచెలుగా ఎదుగుతూ సమాజసేవలో ఎందరో ముందున్నారని గుర్తు చేశారు. ఏజీపీగా బొగ్గుల రవీందర్‌ను గుర్తించి ఎంపిక చేయడం పట్ల బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం బోధన్ పట్టణ ప్రధాన కార్యదర్శి మాసుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెద్దకాపు సాయిలు, నాయకులు శ్రీరామ్ సాయిలు, కే రవి, బండారు ముత్తయ్య, ఎం.ఎల్.బాబు, బొగ్గుల ప్రభాకర్, యేషాల రవీందర్, మున్నూరుకాపు యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు యేషాల సురేందర్ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిద్ధం

- **చీఫ్ ఇంజనీర్ కె. తిరుమల్‌రావ్**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడానికి విద్యుత్ శాఖ సిద్ధంగా ఉందని చీఫ్ ఇంజనీర్ కె.తిరుమల్‌రావ్ అన్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నిజామాబాద్ సర్కిల్‌లోని డిపార్ట్మెంటల్ స్టోర్‌ను టీ.జి. ఎన్.పి.డి.సి.ఎల్. ఐపిసి రాక్, చీఫ్ ఇంజనీర్, కె తిరుమల్ రావ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కె.తిరుమలరావ్ మాట్లాడుతూ.. టి అండ్ డి పనులు కొత్త సర్వీసుల మంజూరులకు కావాల్సినంత మెటీరియల్ సమృద్ధిగా ఉందని తెలిపారు. టి అండ్ డి పనులకు సంబంధించి వంగిన విద్యుత్ పోల్స్‌ను సరిచేయుటకు, డబుల్ జంపరింగ్ చేయుట, చెడిపోయిన ఇన్సులేటర్లు మార్చుట, కాలం చెల్లిన స్టేరాడ్, స్టే వైర్లు మార్చుట, వంగిన క్రాస్ ఆర్మ్‌ను సరిచేయుట, లూజ్‌లైన్లను సరిచేయుట, కాలం చెల్లిన, చెడిపోయిన ఏబీ స్విచ్లను రిపేర్ చేయుట, ఎర్తింగ్ సరి చేయుట, ఫ్యూజ్ క్యారియర్స్ ఫ్యూజ్ బాక్సులు మార్చుట, ఫ్యూజ్ వైరు మార్చుట, టీ రేజర్, వేసి రోడ్డు క్రాసింగ్స్ దగ్గర లైన్ ఎత్తు పెంచుట, ఒక దానికి పై ఒకటి క్రాస్ అయ్యే లైన్‌కు లైన్‌కు మధ్య దూరం పెంచుట మొదలగు పనులు చేయడానికి అన్ని రకాల మెటీరియల్ స్టోర్‌లో అందుబాటులో ఉందని వివరించారు. అలాగే కొత్త వ్యవసాయ కనెక్షన్లు, గృహ కనెక్షన్లు, గృహేతర సర్వీసులకు సంబంధించి మీటర్లు తదితర సామగ్రి మెటీరియల్ సిద్ధంగా ఉందని వివరించారు. నడుస్తున్న వర్షాకాలం, రాబోయే వరదల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడ లోటు లేకుండా కావాల్సినంత మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. రాబోయే అవసరాలను లేకుండా దృష్టిలో పెట్టుకొని వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ అందించడానికి విద్యుత్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు.

కాలువలో యువకుల చేపల వేట


కాలువలో చేపలు పడుతున్న యువకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల మండల కేంద్రం నుండి ఉప్లూర్ గ్రామానికి వెళ్లే దారిలో వరద కాలువ దిగువన ఉన్న కల్వర్టు మాటు కాలువలో యువకులు ఆదివారం సాయంత్రం చేపలు పడుతూ ఎంజాయ్ చేశారు. పలువురు యువకులు కాలువలో గాలాలను వేసి చేపల వేటను కొనసాగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో జోరుగా నీరు ప్రవహిస్తుండడంతో చేపలు కాలువలు కొట్టుకు వస్తాయన్న ఆశతో యువకులు చేపలు వేటను కొనసాగించారు. కల్వర్టు గద్దెపై ఉండి కాలువలోకి తమ గాలాలను విసిరారు. తాము వేసిన గాలాలకు చేపలు చిక్కడంతో పలువురు యువకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్వయంగా చేపలను వేటాడుకుని తేడా తమకెంతో సంతోషంగా ఉంటుందని ఈ సందర్భంగా యువకులు పేర్కొన్నారు. కాలువలో యువకులు చేపల వేట కొనసాగిస్తుంటే ఈ దారి గుండా పోయే వాహనదారులు, ప్రయాణికులు కాలువ వద్ద ఆగి మరి ఆసక్తిగా తిలకించారు.

మానాల మోహన్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో ఉప్లూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్వగృహంలో మానాల మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట శ్రీనివాస్, అవారి శ్రీనివాస్ తదితరులున్నారు.


మానాలను కలిసిన కాగ్రెస్ నాయకులు

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన బదిలీపై వెళ్తున్న కిరణ్‌ను గ్రామస్థులు ఆదివారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సాయరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి, గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి కిరణ్ చేసిన సేవలు మరువలేమని అన్నారు. ఎక్కడ పనిచేసినా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా పేరు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ 3
కామారెడ్డి
సోమవారం | జులై 29, 2024 | www.navatelangana.com

అదనపు తరగతుల కోసం రూ.1.50 లక్షలు విరాళం

నవతెలంగాణ-కామారెడ్డి


విరాళం అందజేస్తున్న పలువురు

క్యాసంపల్లి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో ఇంగ్లీష్ మీడియం బోధన కోసం తరగతి గదులు ఇబ్బందిగా ఉండడం వలన ప్రముఖ వ్యాపారవేత్త, విద్యాదాత తిమ్మయ్య సుభాష్ రెడ్డి తన సొంత డబ్బులతో 3 అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం (1.50) లక్ష యాభై వేల రూపాయలను ఆదివారం గ్రామస్తులకు అందజేశారు. సుభాష్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థికి లయన్స్‌క్లబ్ ఆర్థికసాయం

నవతెలంగాణ-పిట్లం


విద్యార్థికి ఆర్థికసాయం అందజేత

మండలంలోని పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన గిరిజన పేద విద్యార్థి మెగావత్ అనిల్ పై చదువుల నిమిత్తం ఎవరైనా దాతలు ముందు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి మేరకు మండల లైన్స్ క్లబ్ వారు స్పందించి 25వేల రూపాయలను ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. మెగావత్ అనిల్ జేఈఈలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఐఐటికి గాను జమ్మూలో సీటు సాధించినప్పటికీ పేదరికం అడ్డు రావడంతో లైన్స్ క్లబ్ వారు స్పందించి ఆర్థిక సహాయముతో పాటు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ సంజీవరెడ్డి, అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్‌లు ఎప్పుడో..?

- దరఖాస్తు చేసుకొని ఏండ్లుగా ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వితంతువులు, వికలాంగులు, వృద్ధులు

నవతెలంగాణ-నిజాంసాగర్



వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పింఛన్ కోసం ఏండ్లుగా నిరీక్షిస్తున్నారు. దరఖాస్తు చేసుకొని మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఇక వికలాంగుల విషయంలోకి వస్తే సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నా.. ప్రభుత్వ వెబ్ సైట్ ఓపెన్ కావడం లేదని మండల పరిషత్ కార్యాలయంలోని అధికారులు చెబుతున్నారు అని వారు తెలిపారు.

నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతినెల ప్రభుత్వం 2016 రూపాయలు పింఛన్ అందిస్తుంది. కాగా కొత్తవారి దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. భర్తను కోల్పోయి పలువురు మహిళలు వితంతులవుతున్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ పోషణ భారం మొత్తం భార్యలపై పడుతోంది. దీంతో పిల్లల చదువుల భారంతో పాటు కుటుంబ పోషణ వితంతువులకు కష్టంగా మారుతుంది. కొంతమంది చిన్న వయసులోనే భర్తను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వితంతువుల పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ పెన్షన్‌లకు మోక్షం కలిగిస్తుందని ఆశపడ్డా.. తమ గోడును పట్టించుకునేవారే కరువైయ్యారని ఆవేదన చెందుతున్నారు. నాలుగైదు ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు. పలుసార్లు మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్న ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. పాలకులు దృష్టి సారించి తమ ఆవేదనను అర్థం చేసుకొని పింఛన్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ లో దరఖాస్తులు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వితంతువుల పెన్షన్ కోసం సుమారు 400 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. అదే విధంగా వివిధ రకాల అర్హులైన పింఛన్ దారులు 1000కి పై మాటే దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కానీ నేటికీ ఏ ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు కాలేదు. ప్రతినెల దివ్యాంగులు సదరం క్యాంపులకు వెళ్లి అర్హత సర్టిఫికెట్ తెచ్చుకున్న సంబంధిత పింఛన్ సైట్ ఓపెన్ కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తి స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి అందిస్తున్నారు తప్ప కొత్త పింఛన్ మాత్రం అందించడం లేదు. ఇప్పుడైనా ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వారు వేడుకుంటున్నారు.

ఇనుప స్తంభాలు మార్చేదెన్నడో..?

- వర్షం కురుస్తే జంకుతున్న ప్రజలు

నవతెలంగాణ-సదాశివనగర్


గ్రామాల్లో ఉన్న ఇనుప కరెంట్ స్తంభాలు

మండలం లోని పలుగ్రామల్లో కరెంట్ కోసం మొట్టమొదట ఇనుప స్థంబాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇనుప స్థంబాలు అంటేనే ప్రజలు జంకుతున్నారు. వర్షం కురుస్తే ఎక్కడ కరెంట్ షాక్ వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో ఇనుప స్తంభానికే విద్యుత్ దీపాల ఆన్ ఆఫ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని ముట్టుకునేందుకు కూడా జంకుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఇనుప స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని కల్వరాల్, సదాశివనగర్, ఉత్నూర్, పద్మాజివాడి మర్కల్, కుప్రియాల్ తదితర గ్రామాల్లో ఉన్నాయి.

ఎక్కిళ్లు భరించలేక వివాహిత ఆత్మహత్య


మృతిచెందిన చంద్రకళ

నవతెలంగాణ-మద్నూర్

ఎక్కిళ్ల బాధ భరించలేక ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మద్నూర్ మండలంలోని పెద్ద తడగూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్చార్జి ఎస్ఐ సాయన్న వివరాల ప్రకారం.. బస్వాపూర్ గ్రామానికి చెందిన నిమ్మవార్ చంద్రకళ (25)కు పెద్దతడగూర్ గ్రామానికి చెందిన విఠల్‌తో ఐదేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కాగా చంద్రకళకు కొన్ని రోజులుగా ఎక్కిళ్ల సమస్యలతో తీవ్ర ఇబ్బందిపడుతుంది. ఆస్పత్రిలో చూపించినా తక్కువ కాలేదు. ఎక్కిళ్ల బాధను తట్టుకోలేక శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. శవ పంచనామ జరిపి పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

బాధితులకు బాసట

నవతెలంగాణ-కామారెడ్డి

అనారోగ్యానికి గురై.. చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న జనగామ గ్రామానికి చెందిన షేక్ అజీమ వారి కుటుంబ సభ్యులు ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్ రెడ్డిని వెళ్లి సహాయం కోరగా బాసటగా నిలిచినట్టు తెలిపారు. ట్రీట్మెంట్ ఖర్చులు ఎంత అవుతాయోనని కనుక్కుంటనని, ఖర్చుల నిమిత్తం ఒక లక్ష తన వంతుల సాయం చేస్తానని, సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిమ్స్‌లో కొంతవరకు ఎల్ఓసీ ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారరు.

వసతిగృహాలపై చిన్నచూపు చూడొద్దు

- నిత్యం పర్యవేక్షించాలి : ఏబీవీపీ

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ వసతి గృహాలపై అధికారులు చిన్నచూపు చూస్తూ వసతి గృహాలను పర్యవేక్షించడం లేదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామరెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్లో సరైన వసతులు లేక మెనూ ప్రకారం భోజనం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు మాత్రం సన్న బియ్యం అందిస్తున్నామని చెప్తున్నా హాస్టల్లో పాలిష్ చేసిన బియ్యం ఇస్తున్నరాని, వసతి గృహాల చుట్టూ కనీసం ప్రహరీ గోడలు లేక సరైనటువంటి వస్తువులు లేక తగిన రూమ్స్ లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇది ఇలా ఉంటే హాస్టల్ వార్డెన్లు మాత్రం సమయపాలన పాటించకుండా వాళ్ళ ఇష్టం వచ్చినప్పుడు రావడం, వెళ్ళడం విద్యార్థులకు అందుబాటులో లేకపోవడం కామారెడ్డి జిల్లాలో వార్డెన్ల తీరు వివాదాస్పదం అవుతున్న జిల్లా అధికారులు అటువైపు చూడడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం పెటి పెట్టనటువంటి పరిస్థితి నెలకొంది అన్నారు. వెంటనే జిల్లాలో ఉన్నటువంటి హాస్టలను అధికారుల సందర్శించి వసతిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నూతన జాతీయ విద్యా విధానంతో

మూఢనమ్మకాల ప్రేరేపితం

- కాషాయీకరణ లక్ష్యంగా విప్లవకారుల పాఠ్యాంశాలు తొలగింపు
- తిప్పికొట్టేందుకు విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి : ఏఐఎఫ్‌డీఎస్

నవతెలంగాణ-కామారెడ్డి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, నాయకులు

'కేంద్ర ప్రభుత్వం విద్య కాషాయీకరణ చేయడమే ముఖ్య ఎజెండాగా పనిచేస్తుంది. అందుకు తగ్గట్టుగానే విద్యావ్యవస్థలో పలు మార్పులు, చేర్పులు చేస్తూ దేశ స్వాతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించిన ఎందరో విప్లవకారుల చరిత్రలను పాఠ్యపుస్తకాల నుండి తొలగించింది. మూఢనమ్మకాలను ప్రేరేపించే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారా మనువాదాన్ని, విద్యా కాషాయీకరణ అనే ఎజెండాలను అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం బలంగా పూనుకుందని, దాన్ని తిప్పికొట్టాలని' ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆగస్టు ఒకటి, రెండు తేదీల్లో హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగే ఏఐఎండీఎస్ జాతీయ జనరల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఆదివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనువాద మత ఛాందస భావాలను ఏఐఎఫ్డిఎస్ దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తూ శాస్త్రీయ విద్యా విధానం కావాలని ప్రైవేట్ యూనివర్సిటీ బిల్లులకు వ్యతిరేకంగా, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దుచేసి కామన్ స్కూల్ విద్యా విధానంపై అనేక పోరాటాలు చేసిందన్నారు. భవిష్యత్తులో విద్యార్థి లోకానికి అండగా మరెన్నో ప్రగతిశీల పోరాటాలు నిర్వహిస్తూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ అనిల్, భరత్, శివ , ఆదిత్య సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా పోలీసులు


బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

తాను చనిపోతూ అవయవ దానం చేసి మరో నలుగురికి ప్రాణం పోసిన మెట్టు ప్రవీణ్ (పెద్దమల్లారెడ్డి) కుటుంబానికి భిక్కనూరు పోలీసులు అండగా నిలిచారు. భిక్కనూరు సిఐ సంపత్ కుమార్, ఎస్ఐ సాయికుమార్ లు ప్రవీణ్ కుటుంబ పరిస్థితులను తెలుసుకొని వారికి రూ 6 వేల రూపాయల విలువగల మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందించారు. ఆదివారం సిద్ధరామేశ్వర ట్రస్ట్ సభ్యులు ఈ నిత్యావసర వస్తువులను ప్రవీణ్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా తమకు అండగా నిలిచిన భిక్కనురు సిఐ, ఎస్సైలకు ప్రవీణ్ భార్య రేఖ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధరామేశ్వర ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

పలు గ్రామాల్లో వనభోజనాలు


వనభోజనాలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. ప్రతి సంవత్సరం జులై చివరి మాసంలో వనభోజనాలకు వెళ్లి వన దేవతలకు పూజలు నిర్వహించేవారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని మేంగారం, లింగంపల్లి, పోతాయపల్లి, లింగంపేట్, కోమటిపల్లి శెట్టిపల్లి శెట్టిపల్లి సంగారెడ్డి ఎక్కపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలో గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు. అనంతరం భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.

ఊరు.. వాడ బోనమెత్తింది


ఎల్లారెడ్డిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు..


నాగిరెడ్డిపేట్‌లో వైభవంగా బోనాల పండుగ


కామారెడ్డిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

- జిల్లా వ్యాప్తంగా బోనాల పండుగ
- ఊరేగింపులతో గ్రామాల్లో పండుగ శోభ

నవతెలంగాణ-విలేకరులబృందం

జిల్లా వ్యాప్తంగా ఊరు, వాడ తేడా లేకుండా బోనాల పండుగలు ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. కాలనీల వారీగా, కులాల వారీగా బోనాల పండగులు నిర్వహించుకొని గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించుకున్నారు. డప్పుసప్పుల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తుంటే పల్లె పరవశించింది. పండుగ శోభ నెలకొంది.

గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు మండల గ్రామాలలో ఆదివారం గ్రామ దేవతలకు ఘనంగా బోనాల సమర్పించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బంగారు మైసమ్మ, ముత్యాల పోచమ్మ, మదన పోచమ్మ, భూలక్ష్మమ్మ బద్ది పోచమ్మ లకు పట్టణ ప్రజలు డప్పు చప్పుల మధ్య ఘనంగా బోనాలు సమర్పించుకున్నారు. ఆషాడ మాసం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలోని 35 వార్డులో హాలియ దాసరి కాలనీవాసులు ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలను బంగారు మైసమ్మ, ముత్యాల పోచమ్మ, మదన పోచమ్మ, భూలక్ష్మమ్మ, బద్ది పోచమ్మ కు ఘనంగా బోనాలను సమర్పించి, మహిళలు అమ్మవార్లకు పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తెచ్చుకున్నారు. బోనాల ఊరేగింపులో మంగళ వాయిద్యాలు డప్పులు, డోల్లు తదితర వాటితో దేవునిపల్లి తో పాటు పలకాలనీలో బోనాలను భారీగా ఊరేగించి అమ్మవార్లకు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. రాజు పాటిల్, హెలియా దాసరి సంఘం ప్రతినిధులు చిన్న పోచయ్య, చిన్న నరసింహులు, శ్రీరామ్ గంగయ్య, చిన్న నల్ల పోచయ్య, సుధిన బోయిన రాములు, ఎస్. పెద్ద సాయిలు, టంటం ముత్తయ్య, పెద్ద ఉప్పు నర్సింలు, నరేందర్, ఎస్ లక్ష్మణ్ హెూలీయ దాసరి సంఘం వారు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో ఆదివారం నాడు ఊరదేవతలకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఆదివారం నాడు కులబేడల వారీగా ఈ బోనాల పండుగ గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. మున్నూరు కాపు, పద్మశాలి కులస్తులు చాకలి కులస్తులు బేడల వారిగా బోనాలు నైవేద్యాలు సమర్పించారు, ఈ బోనాల పండుగ గత మంగళవారం నుండి ప్రారంభం అయ్యాయి, చివరిగా వచ్చే మంగళవారం నాటికి బోనాల పండుగ సమయం ముగుస్తుందని గ్రామస్తులు తెలిపారు.


ఎల్లారెడ్డిలో..

తిమ్మానగర్‌లో ఘనంగా బోనాల పండుగ

పిట్లం: పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో మహంకాళి అమ్మవారి గుడి దగ్గర బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. గ్రామ ప్రజలు ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా ముస్కుల అరుణ్ రెడ్డి సారే, నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహంకాళి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

గోలి లింగాల్‌లో

నాగిరెడ్డి పేట్: నాగిరెడ్డి పేట్ మండలంలోని గోలీలింగాల గ్రామంలో ఆదివారం రోజు బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తలపై బోనం ఎత్తుకొని గ్రామంలో వీధుల గుండా ఊరేగి గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు శివకుమార్, మురళి, గ్రామ పెద్దలు వెంకటరామరెడ్డి, రామస్వామి, నరసింహులు, సాయిలు, లింగా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో ఆదివారం నాడు సాయంత్రం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావుతో పాటు ఎంపీ సురేష్ షట్కార్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం పట్టణంలో ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి నృత్యాలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో..

రాత్రి సమయంలో విద్యుత్ సమస్య తీర్చిన ఏఈ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల కేంద్రంలో శనివారం సుమారు పది గంటల ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో గ్రామస్తులు ఏఈ బాబా శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రాత్రి సమయంలోనూ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి.. సమస్యను పరిష్కరించారు. దీంతో ఏఈతో పాటు విద్యుత్ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.



రాత్రి సమయంలో విద్యుత్ పనులు

విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించటం సరికాదు



నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర బడ్జెట్లో విద్యరంగానికి తక్కువగా నిధులు కేటాయించడం సరికాదని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మహిళా మోర్చా నాయకురాలు స్వభావిక గౌడ్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ. రాష్ట్ర బడ్జెట్ విద్యరంగాన్ని నిరాశ పరిచిందని విమర్శించారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి సరైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కాలువల్లో మురుగు

- స్వైర విహారం చేస్తున్న దోమలు

నవతెలంగాణ-ఆర్మూర్

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు అయిన ఆర్మూర్ నుంచి మామిడిపల్లి ద్వారా గోవింద్‌పేట్ వైపు వెళ్లే కాలువ అద్వాన్నంగా తయారైంది. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి పాత గ్రామపంచాయతీ నుంచి శ్మశాన వాటిక వైపు వెళ్లే సరస్వతినగర్‌లోని కెనాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి కంపు కొడుతోంది. పాత గ్రామపంచాయతీ భవనాన్ని బస్తీ దావఖానాగా మార్చారు. భీంగల్ వైపు వెళ్లే ప్రజలు బస్సులో కోసం ఇక్కడనే నిలబడతారు. కొత్త గ్రామపంచాయతీ భవనం సైతం ఇక్కడే ఏర్పాటు చేశారు. నీరు నిల్వ ఉండడంతో కెనాల్ కంపు కొడుతోంది. ప్రాజెక్టులో నీరు చేరి ఆయకట్టులోని చెరువులను నింపేందుకు నీటిని వదిలితే కెనాల్‌లోని మురుగంతా చెరువుల్లోకి చేరుకుంటుంది. దీంతో చెరువుల్లోని నీరంతా కలుషితమై జీవరాసులు మరణించే ప్రమాదం ఉంది. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో కెనాల్‌లోని మురుగుతో వ్యర్థ పదార్థాలతో వచ్చే దుర్వాసనతో ప్రజలు ఆరోగ్యం దెబ్బతినడం ఖాయంగా కనిపిస్తుంది. కెనాల్‌లో పేరుకుపోయిన మురుగునీటితో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దోమల స్వైర విహారం..

పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లిలో రాత్రి అయిందంటే చాలు దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవలసిన సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని గోల్‌బంగ్లా, అవుట్‌గల్లి, జిరాయిత్‌నగర్, రాజారాంనగర్, జండాగల్లి, పెర్కిట్, మామిడిపల్లిలోని కాలనీతో పాటు ఇతర కాలనీల్లో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. కాగా ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే నామమాత్రంగానే కొనసాగుతుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫాగింగ్ యంత్రాలు కొన్ని చెడిపోయినా.. మరమ్మతులు చేయించి దోమల నివారణకై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసర ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పాత కూలర్లు, టైర్లలో ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలను దూరంగా పారవేయాలి. **- జె.శివరాజ్, సాయి చందన పిల్లల వైద్య నిపుణులు, ఆర్మూర్.**

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి



మున్సిపల్ పరిధిలోని వార్డులోనూ దోమల బెడద రోజురోజుకు పెరిగి పోతుంది. దాంతో చిన్నారులు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నవి. సంబంధిత అధికారులు కాలనీలో ఫాగింగ్ చేస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.
- కార్తీక్, మామిడిపల్లి.

నిధుల కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవి నరసింహారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం శ్రమిస్తున్నారని బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవి నరసింహారెడ్డి, మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షులు ఉదయ్ అన్నారు. ఆదివారం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్లను స్టాఫ్ నర్సులను నియమించవలసిందిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరగా అందుకు ఆయన స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఆరోగ్య సిబ్బందిని నియమించారని తెలిపారు. దీనిని కాంగ్రెస్ నాయకులు తాముచేసినట్లు ప్రజలను మభ్యపెడుతున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, ఆకుల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి యుగంధర్, ప్రకాశ్, రాజేశ్వర్, రాజ్‌కుమార్, పట్టణ యువ మోర్చా నాయకులు కలిగోట ప్రశాంత్, ఉదయగౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు



బోనాలతో చిన్నారులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బోనాల సంబురాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పోతరాజుల విన్యాసాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల నుంచి విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పెద్దమ్మ, నల్ల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మహాలక్ష్మి, పెద్ద పోచమ్మ ఆలయాల్లో పలురకాల నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి బోనాలు ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ పాల్గొన్నారు.

రోడ్లను బాగుచేయండి

- గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు



గుంతలమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో ప్రశాంతి నిలయం వద్ద రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డు గుంతల మయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోనే మూడు ప్రైవేటు విద్యా సంస్థలున్నాయి. ఆ విద్యాసంస్థలకు నిత్యం వందలో సంఖ్యలో విద్యార్థులు బస్సుల్లో వెళ్తుంటారు. తమ తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు దింపి, తీసుకొచ్చేందుకు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. రోడ్డంతా గుంతలమయమై ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రశాంతి టవర్ నుండి అమ్మ వెంచర్‌కు వెళ్లే రోడ్లులో అన్నీ గుంతలమయంగా మారాయి. వీటిని అధికారులు పర్యవేక్షణ చేసి రోడ్లని మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విచ్చలవిడిగా కుక్కల సంచారం

- భయాందోళనలో ప్రయాణికులు



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో ప్రధాన రోడ్లపై కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో కుక్కలు దాడిచేసేందుకు పైపైకి వస్తూ ఉండడంతో వారు భయాందోళనలకు గురవుతున్నారు. కందకుర్తి గ్రామంలో ఈ సంవత్సరం సుమారు 13 మంది కుక్కటుకు గురయ్యారు. ప్రతీ గ్రామాల్లో విచ్చలవిడిగా రోడ్లపై సంచరించడం పరిపాటి అయ్యింది. ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ సిబ్బంది వాటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

హామీలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- బిజెపి మండలాధ్యక్షులు సురేష్ నాయక్

నవతెలంగాణ-మాక్లూర్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై స్పష్టత వచ్చిన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బిజెపి మండలాధ్యక్షులు రామవాత్ సురేష్ నాయక్ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో బిసిలకు రిజర్వేషన్ పెంచుతామని చెప్పారని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారని వివరించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేపట్టి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ పెంచుతామన్నారని, అదేవిధంగా స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ ఉపవర్గీకరణ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. రిజర్వేషన్లు పెంచడం ద్వారా సుమారుగా పంచాయతీల్లో, మున్సిపాలిటీలో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని, కాబట్టి ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు ఇచ్చిన హామీ నెరవేరదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు 8నెలలు గడుస్తున్నా బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కనీస వేతన అందజేస్తామన్నారని, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లకు గౌరవ వేతనం నెలకు రూ.1500 ఇస్తామని, మాజీ సర్పంచులకు, మాజీ ఎంపీటీసీ సభ్యులకు, మాజీ జెడ్పిటిసిలకు గౌరవ పెన్షన్ అందజేస్తామనీ, సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ గౌరవ వేతనం పెంచుతామని ప్రకటించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల విషయంలో స్పష్టత వచ్చిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సమస్యలున్న చోట విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చేస్తున్నామని ఎస్ఈ ఆర్ రవీందర్ అన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటం వలన వినియోగదారులకు ఎక్కడా అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నందుకు అధికారులను, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అభినందించారని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలున్న చోట విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించడంలో వారి సేవలు శ్లాఘనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో గడచిన నాలుగు నెలల్లో 1300 వంగిన విద్యుత్ స్థంబాలు, 260 తుప్పు పట్టిన స్థంబాలు, వదులుగా ఉన్న 11 కిలోమీటర్ల లైన్లు, 510 స్టేవైర్లు మార్చామని ఈ కార్యక్రమంలో కొంతమంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యుత్ శాఖకు సహకారం అందిస్తున్నారని, ఇకపై ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టి విద్యుత్ వ్యవస్థను పటిష్టపరచి విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఇదే పనిలో భాగంగా విద్యుత్ నెట్వర్క్‌లో ప్రమాద భరితంగా ఉన్న వాటిని ముందస్తుగానే గుర్తించి సమయానుసారంగా వాటిని సరిచేసి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు చెపట్టామని అన్నారు. భారీ వర్షాల్లో రేయింబవళ్లు అధికారులు, సిబ్బంది ఆహర్నిశలు నిబద్ధతతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు.

పట్టణంలో స్వచ్ఛకాలనీ



శ్రమదానం చేస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 55వ స్వచ్ఛ కాలనీ సమైఖ్య కాలనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడా రోడ్లపై నిల్వ ఉన్న నీటిని మురుగు కాల్వల్లోకి వెళ్ళేవిధంగా శుభ్రం చేసి 8వ రోడ్డులో ఉన్న చిల్డ్రన్ పార్కులో పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశామని తెలిపారు. జర్నలిస్టు కాలనీలో ఓపెన్ జిమ్, కొన్ని సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం కావాలని, అలాగే ఆర్కే హాస్పిటల్ వద్ద గల కెనాల్ బ్రిడ్జిపై రాత్రికి ఎవరైన ఒంటరిగా వెళితే మగవారుని, మహిళలను కొట్టి బెదిరించి సెల్‌ఫోన్లు, డబ్బులు లాక్కుని పారిపోతున్నారని వివరించారు. కెనాల్ కట్టపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు, పోలీసులు నిఘా పెట్టి ప్రజలకు రక్షణ కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, గడ్డం శంకర్, ఎల్.టి.కుమార్, కొంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య, గణేష్, నల్ల సాయన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెడ్‌కుక్ పోస్టుకు 10 దరఖాస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెడ్‌కుక్ పోస్టుకు 10దరఖాస్తులు వచ్చాయని పాఠశాల నిర్వహణ కమిటీ పేర్కొంది. మండల విద్యాశాఖ అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో హెడ్‌కుక్ పోస్టుకు ఎంపిక చేపడుతున్నట్టు పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లో కమిటీ కూర్చొని చర్చించనున్నట్లు తెలిపారు.

గంజ్‌లో మద్యం సేవిస్తే 10 రోజులు జైలు



మార్కెట్ వద్ద హెచ్చరిక బోర్డు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో గల వ్యవసాయ మార్కెట్ కమిటీలోని మార్కెట్ యార్డులో, షెడ్లల్లో, గోదాముల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో, చెట్ల కింద ఎక్కడైన గానీ మద్యపానం పూర్తిగా నిషేదించినట్టు పోలీసులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరికను ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 70(ఏ) సిటీ పోలీస్ యాక్ట్ క్రింద రూ.5,000 వరకు జరిమానా విధిస్తూ 10 రోజులు కారగార శిక్ష విధించబడునని నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీలోని పలు ప్రాంతాలలో గోడలపైన ఫ్లెక్సీలతో హెచ్చరిక నోటీసులను ఏర్పాటు చేశారు.

భార్యభర్తలు కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి

- మ్యారేజ్ సండే దంపతులకు సన్మానం



సన్మానం పొందిన మ్యారేజ్ సండే దంపతులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

భార్యాభర్తలు కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని జక్రాన్‌పల్లి సిఎస్ఐ చర్చి పాస్టర్ శశి ప్రకాష్ ఆదివారమన్నారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ వెస్లీ చర్చిలో దక్షిణ ఇండియా మెదక్ అధ్యక్ష మండలంలోని గోదావరి డిసిసి పరిధిలోని జక్రాన్‌పల్లి పాస్టరెట్‌లో దక్షిణ్ ఇండియా మెదక్ అధ్యక్ష మండలం పంచాంగం ప్రకారం మ్యారేజ్ సండే సందర్భంగా జక్రాన్‌పల్లి సిఎస్ఐ వెస్లీ చర్చిలో, కేశ్‌పల్లి సిఎస్ఐ చర్చిలో మ్యారేజ్ సండేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ శశి ప్రకాష్ మాట్లాడుతూ.. జంట వందేళ్లు కలిసి జీవించాలని మధ్యలో మనస్పర్థలు వచ్చి విడిపోకూడదని సూచించారు. జీవితంలో భార్యాభర్తలకు ఎన్నో కష్టాలు వస్తుంటాయని, కష్టాలను భరిస్తూ జీవిత భాగస్వామితో కష్టాలను పాలుపంచుకుంటేనే జీవితమంటారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీల మైత్రి వారు, యూత్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

30 నుంచి ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో తిథి భోజన పథకం

నవతెలంగాణ-ఏర్గట్ల

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం పోషక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీ నుంచి తిథి భోజనం అనే పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి తెలిపారు. పాఠశాలలను, సమాజాన్ని దగ్గర చేయడానికి ఈ పథకం ప్రవేశపెట్టబడిందని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా పుట్టినరోజు, వివాహ కార్యక్రమాలు జరిపితే పండగలు, పర్వదినాలలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పండ్లు, స్వీట్లు, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించడానికి ముందుకురావాలని తెలిపారు. ఎవరైనా దాతలుంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్, కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ఏర్గట్ల



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మండలంలోని బట్టాపూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేలు కేసీఆర్, కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బట్టాపూర్ బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ.. కాళేశ్వరం నుండి రైతుల పంటల కోసం నీటిని విడుదల చేయకపోతే కేసీఆర్ ఆధ్వర్యంలో 50 వేల మంది రైతులతో కాళేశ్వరం వెళ్ళి పంప్‌లు ఆన్ చేయిస్తామని కేటీఆర్ అసెంబ్లీలో చెప్పగానే, ప్రభుత్వం దిగివచ్చి మరుసటిరోజే నీటిని విడుదల చేయడంతో నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశామని, కేసీఆర్ నిరంతరం రైతుల కోసం పరితపించే నాయకుడని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇకనైనా నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు కూతురు చిన్న సాయన్న, బీఆర్ఎస్ నాయకులు గంగారెడ్డి, కుండ నవీన్, రాజేశ్వర్, తిరుపతి, శ్రీధర్ గౌడ్, కిషన్, దయానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3 నుంచి భీంగల్‌లో రాష్ట్రస్థాయి క్యారం పోటీలు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ రాష్ట్ర క్యారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మందుల హన్మండ్లు స్మారక రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారం పోటీలను భీంగల్ గ్రామంలోని జేబీఎస్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ క్యారం పోటీలు ఆగస్టు 3,4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్టు క్యారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు క్యాతం సంతోష్ కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మెన్ సింగిల్స్, వుమెన్ సింగిల్స్, మెన్ డబల్స్ వంటి ఈవెంట్స్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌కు జాతీయస్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో ఆడిన ఆటగాళ్లసైతం పాల్గొంటున్నారని తెలియజేశారు. ప్రవేశ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ ఆగస్టు 1, 2024 లోపు వివరాల కొరకు ఎస్.శోభన్‌రాజ్ (9440307023)ను సంప్రదించాలని సూచించారు.

నామినేటెడ్ పదవుల కోసం నాయకుల చుట్టూ..



నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో మకాం వేసినట్టు సమాచారం. మంత్రులను, పెద్ద నాయకులను కలుస్తూ, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వాలని మొర పెట్టుకుంటున్నట్టు వినికిడి. గత పది సంవత్సరాల నుండి ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కష్టపడి పని చేసినందుకు, గుర్తించాలని కోరుతున్నారు. పార్టీని అంటిపెట్టుకొని ఉన్నందుకు తమ సేవలను గుర్తించాలని కోరుతున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ తో పాటు పలు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కష్టపడిన నాయకులకు పదవులు దక్కాలని పలువురు కోరుతున్నారు. ఎవరికి ఏ పదవులు తగ్గుతాయో వేచి చూడవలసిందే.

జీజీహెచ్ ఆరోగ్య శ్రీ ఖాతాలో రూ.50 వేలు మాత్రమే

మందుల కొనుగోళ్లకు, పరికరాల మరమ్మతులకు ఇబ్బందులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాస్పత్రి

పేద ప్రజలు అనారోగ్యానికి గురైతే.. ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలందించే విషయం తెలిసిందే. అందులో భాగంగా ఒక్కో ఆస్పత్రికి ఒక్కో ఆరోగ్య శ్రీ ట్రస్టు ఖాతా ఉంటుంది. జిల్లా ప్రభుత్వాస్పత్రి పరిధి లోని ఆరోగ్య శ్రీ ఖాతాలో రూ.50వేలు మాత్రమే ఉన్నాయి. దీంతో పేద ప్రజలకు సరైన సమయంలో నాణ్యమైన వైద్యం అందించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రతి ఒక్కరికి నాణ్యమైన అన్ని రకాల వైద్య సేవలు అందించుటకై రాష్ట్ర ప్రజలకు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 2007 ఏప్రిల్ 1న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. పథకంలో భాగంగా గతంలో అనారోగ్యానికి గురైన రోగి వైద్య చికిత్స కోసం మొత్తం రూ.2లక్షలు వరకు ఖర్చు చేసే సౌకర్యం ఉండేది. దానిని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10లక్షలకు పెంచింది. ఇదిలా ఉండగా.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటినుంచే అందుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ దానికి ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందించిన వైద్య చికిత్సలలో డాక్టర్లకు, వైద్య బృందానికి, సిబ్బందికి ఆసుపత్రికి ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్కో ఆపరేషన్‌కు ఒక్కో లెక్క ప్రకారం పరిగణలోకి తీసుకొని బిల్లులను చెల్లింపులు చేపడుతుంది.

ఆ బిల్లులో వచ్చిన ఆ డబ్బుల ద్వారా ఆసుపత్రి అభివృద్ధి చేసుకునేందుకు, ఆసుపత్రిలో రోగులకు అవసరమైన చికిత్స నిమిత్తం మందులు, వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆ డబ్బులను ఉపయోగించాలని ప్రభుత్వం ఆనాడే నిర్ణయించింది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన డబ్బులలో (ఉదాహరణకు) రూ.100కు రూ.35 చికిత్స చేసిన సమయంలో ఉన్న డాక్టర్లు, అసిస్టెంట్‌లు, ఆపరేషన్ థియేటర్‌లో పనిచేసే సిబ్బంది అందరికీ కలిపి చెల్లించి.. మిగతా రూ.65ను ఆసుపత్రి అభివృద్ధి కోసం.. పరికరాలను, మందులను కొనుగోలు చేయాలని నిబంధన ఉంది. అయితే ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా సేవలందినందుకుగానూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే డబ్బుల్లో ప్రస్తుతం సుమారు రూ.5కోట్ల 89లక్షలున్నాయి. అయితే 2016లో "బి బ్రాన్" కంపెనీవారు బిల్లు చెల్లించాలని కోర్టు నోటీసులు అందించడంతో రూ.5.89 కోట్లను అలాగే ఉంచారు. కోర్టు కేసు తేలే వరకు బిల్లు చెల్లించకుండానే ఆపివేశారు. అవిపోను మిగతా రూ.50,178 ఉన్నాయి.

మంత్రి కార్యక్రమానికి రూ.20లక్షలు ఖర్చు..

ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు కొనుగోలు చేసుందుకు అలాగే మందులు కొనుగోలు చేయవలసి ఉండగా.. 2022 అక్టోబర్‌లో మంత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ భవనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి రూ.20లక్షల రూపాయలను ఖర్చు చేశారు. ఆరోగ్యశ్రీ ఖాతాలో డబ్బులు మిగిలి ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందే వారికి మరిన్ని పరికరాలు కొనుగోలు చేసే అవకాశంతో పాటు మందులు కొనే అవకాశాలు కూడా ఉండేవని, దానితో రోగులకు సరైన సులువైన సమయంలోనే వైద్యం అందించే వారమని పలువురు వైద్యులు చెబుతున్నారు.

త్వరితగతిన సేవలకై 'ఎస్‌ఎపి' యాప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు త్వరితగతిన సేవలనందించడానికి కొత్త సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నామని సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. సంబంధిత సెక్షన్ ఏ.ఇ, మొదటగా ఒక పనికి కావాల్సిన మెటీరియల్స్ స్టాక్ ఉందో లేదో ఏస్.ఎ.పి. సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్స్‌ను రిజర్వు చేసుకుంటారని తెలిపారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్స్ తాలూకు సమాచారం ఎస్.ఎ.పి వర్క్ ఫ్లో ద్వారా సంబంధిత ఎ.డి.ఇకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళ్తుందని పేర్కొన్నారు. మెటీరియల్స్ తీసుకొనే అధికారికి, ఏ రోజు మెటీరియల్స్ తీసుకోవడానికి రావాలో ఆ తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, ఎస్.ఎ.పి మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని తెలిపారు. తెలియజేసిన తేదీ, సమయానికి స్టోర్‌కి వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని తెలిపారు. దీనిలో పేపర్ ప్రస్తావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని, అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తవుతాయని వివరించారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టకముందు కావాల్సిన మెటీరియల్ లిస్ట్‌ను ప్రింట్ తీసుకొని, సంతకాలు తీసుకొని, ఆ పేపర్ సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవలసి ఉండేదని, ఈ సమస్యలను అధిగమించడానికే ఈ - స్టోర్ విధానాన్ని సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్.ఎ.పి. టీం వారు చేశారని తెలిపారు. పేపర్ పని లేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరియల్ ఏమైనా మిగిలి ఉంటే వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకునే వెసులుబాటు మొత్తం కూడా ఆన్‌లైన్‌లోనే చేశామని తెలిపారు. ఈ పద్ధతి వలన కూడా ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు. సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా 24 గంటల అందిస్తున్నామని ఎస్ఈ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాల పండుగలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని మెండోరా, పల్లికొండ, పిప్రి, బాచన్‌పల్లి, పురాణిపేట్, బాబాపూర్, బాబానగర్, జాగిర్యాల్, బడాభీమ్‌గల్, చేంగల్, సికింద్రాపూర్, ముచ్కూర్, గోనుగోపులతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం ఆదివారం పురస్కరించుకొని బోనాల పండుగ సందర్భంగా గ్రామం నలువైపులా కొలువై ఉన్న గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతలైన పెద్దపోచమ్మ, పెద్దమ్మతల్లి, 5 చేతుల పోచమ్మ, మహాలక్ష్మి, నల్ల పోచమ్మ, మత్తడి పోచమ్మ, ముత్యాలమ్మ తదితర గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా వన భోజనాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు కుమ్మరి గంగాధర్, కోశాధికారి సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, సొసైటీ డైరెక్టర్ గంగం లక్ష్మి, అశోక్, వివిధ గ్రామాల వీడిసి సభ్యులు, నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

బోనాల పండుగ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండారు దత్తాత్రేయ పార్టీలకు సంబంధం లేకుండా అందరూ ఇష్టపడే వ్యక్తి అని కొనియాడారు. అలయ్ బలాయ్ పేరిట రాజకీయ నాయకులను మిగతా ప్రముఖులను ఏకతాటిపైకి తెచ్చే వ్యక్తి అని ఆయన తెలిపారు.

సర్కారు బడి.. సమస్యల ఒడి

- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేని దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-బాల్కొండ



ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనం



మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంఈఓ పర్యవేక్షణ (ఫైల్)

మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల ఖిల్లా సమీపంలోని ముళ్ల పొదల చాటుకు వెళ్లాల్సి వస్తోంది. కాలకృత్యాలు తీర్చుకు నేందుకు ముళ్లపొదల వద్దకు వెళ్లే విద్యార్థులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

ఈ పాఠశాల నిర్మించి సంవత్సరం గడుస్తున్నా.. ఈ యేడూ బడికి వచ్చే విద్యార్థులకు అవస్థలు పడక తప్పని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఉన్నా అధికారులు మాత్రం కాలయాపన చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అవస్థలు పడు తున్న విద్యార్థుల సమస్యపై అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారంగా పాఠశాల వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు



మరుగుదొడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మించడానికి కాంట్రాక్టర్లు ఎవరైనా ముందుకు వస్తే వారికి వెంటనే పనులు అప్పజెప్తాం. **- ఎంపీడీవో, విజయభాస్కర్‌రెడ్డి**

ఆగని వర్షాలతో రైతుల్లో ఆందోళన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలో ఈ ఏడాది వానాకాలం పంట సాగులో భాగంగా ఇక్కడి రైతన్న పెసర మినుము సోయా పత్తి కంది తదితర పంటలు సాగు చేశారు. ఈ పంటలకు సరియైన సమయంలో వర్షాలు పడక ఆందోళన చెందుతూ రైతన్నలు గ్రామ దేవతలకు జలాభిషేకాలు ఆలయాలు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు 15 రోజుల క్రితం వర్షాల కోసం ఎదురుచూసిన రైతన్న ప్రస్తుతం వారం పది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఆగని వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి పంటలకు అతివృష్టి వర్షాలు నష్టం కలిగిస్తాయి. దాదాపు వారం పది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముసురు వర్షాలతో పంటలకు భారీగా నష్టం కలిగిస్తున్నాయని రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ మండలంలో దాదాపు ఈనెల 17 నుండి ఈనెల 26 వరకు కురిసిన వర్షాపాతం వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం 25 సెంటీమీటర్ల వర్షం నమోదయింది. ఈనెల 17న 3.2 మిల్లీమీటర్లు ఈనెల 19న 43,2 ఈనెల 20న 1.2 ఈనెల 21న 33.0 మిల్లీమీటర్లు ఈనెల 22న 64.2 ఈనెల 24న 4.2 ఈనెల 25న 39.0 ఈనెల 26న 23,0 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదయింది. వారం పది రోజుల నుండి కురిసిన వర్షాపాతం 25 సెంటీ మీటర్లు కురిసింది. భారీ మొత్తంలో కురుస్తున్న వర్షాలకు పూతకాతకు వచ్చిన పంటలు దెబ్బతింటున్నట్లు ఇక్కడి రైతన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీడపురుగుల బెడద అధికమవుతున్నట్లు రైతన్నల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది.

ప్రాజెక్టులకు వరద తాకిడి

- 33 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ
- నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులకు కొనసాగుతున్న స్వల్ప ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-నిజామాబాద్
నిజాంసాగర్/నాగిరెడ్డిపేట్

ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు వరదనీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద నీరు వచ్చి చేరుతుండటంతో క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1074.1 అడుగుల (31.035 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1087 అడుగుల (66.508 టీఎంసీల) నీరు నిల్వ ఉది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎస్సారెస్పీకి మొత్తం 24.766 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. మిషన్ భగీరథ, కాలువల ద్వారా మొత్తం 2.354 టీఎంసీల నీరు విడుదల చేశారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాని కి ప్రాజెక్టులోకి స్వల్పంగా 750 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.693 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పోచారం ప్రాజెక్టుకు కొనసాగుతున్న స్వల్ప ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నట్టు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి పోచారం ప్రాజెక్టులు 10.30 అడుగుల నీటిమట్టానికి నీరు చేరినట్లు ఆయన తెలిపారు.

30న ఆశాల చలో హైదరాబాద్

- జయప్రదం చేయండి : సీఐటీయూ



నవతెలంగాణ-జుక్కల్

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ పిలుపునిచ్చారు. హైదారాబాద్‌లోని కోఠిలోని జాతీయ ఆరోగ్య మిషన్ కార్యాలయం వద్ద చేపట్టే కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశాలకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీసం వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ఈ ఎస్ ఐ, పి ఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని గతంలో ఇచ్చినట్లుగా ప్రతి నెల 2వ తేదిన పారితోషికం చెల్లించాలని, 2021జులై నుండి డిసెంబర్ వరకు చెల్లించాల్సిన 6 నెలల పి ఆర్ సి యెరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆశాలకు 50 లక్షల ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు రూ.50 వేలు చెల్లించేలా వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని, పనిభారం తగ్గించి జాబ్ చార్ట్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు చెల్లించి ఇప్పుడున్న పారితోషికంలో సగం పెన్షన్ చెల్లించాలని తదితర 24 డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించుకునేందుకు 30న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు.

సీడ్ బాల్స్ తయారీ



సీడ్‌బాల్స్ తయారీలో స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్ట్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆదివారం రెండవ విడత సీడ్ బాల్స్ లింగంపేట మండలం మోతే గ్రామంలో తయారు చేశారు. ఎన్జీవో ఫౌండర్ జీవన్ నాయక్ ఆదేశాల మేరకు రెండవ విడత సీడ్ బాల్స్ ను తయారు చేసినట్టు కోఆర్డినేటర్ పవన్ కళ్యాణ్ తెలిపారు. మొదటి విడతలో భాగంగా తయారుచేసిన సీడ్ బాల్స్ మొలకెత్తి మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో రెండో విడత సీడ్ బాల్స్ లను ప్రతి ఎన్జీవో వాలంటీర్ల ఇంటి వద్ద తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు భాగ్య లక్ష్మి, మౌనిక, పూజిత, నవనీత, పూజా, శ్రీనివాస్, అశ్విని పలువురు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ పండుగ



తీజ్ పండుగలో పాల్గొన్న యువతులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం వజ్జెపల్లి,యాచారం బంజారా తండాలో ఆదివారం ఘనంగ తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. యువతులు తమకు మంచి వరుడుకావాలని దైవాన్ని కోరుతూ భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించుకున్నారు. గిరిజన యువతులు తొమ్మిది రోజులు అత్యంత నిష్టంగా ఉపవాసాలు చేస్తారు. ఆకుకూరలు, సజ్జల రొట్టలతో ఒకే పూట ఆహారం తీసుకుంటూ పూజలు చేస్తారు. పండుగలో భాగంగా తొలుత పుట్ట మట్టిని తీసుకొచ్చి, వెదురుబుట్టలో దాన్ని వేసి అందులో గోధుమలు పోసి మొలకలు పెంచుతారు. ఇవి ఎంత పచ్చగా ఉంటే భవిష్యత్‌లో అంత ఆయు రోగ్యాలు, సంతోషాలు కలుగుతాయని వారి నమ్మకం. ఉత్సవాల చివరి రోజున బుట్టల నుంచి మొలకలు వేరు చేసి పురుషుల తలపై పెడతారు. వాటిని ఇళ్లకు తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మొలకలను భాజ భజంత్రీల నడుమ పాటలు పాడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటలు బావులలో నిమజ్జనం చేస్తారు. తమ వెంట తెచ్చుకున్న ఫలహారాన్ని పంచుకుని తింటారు. యువతుల సోదరులు నీటితో యువతుల పాదాలు కడిగి నమస్కారం చేయడంతో పండుగ ముగిసింది. తండా నాయకులు లచ్చిరాంనాయక్, సంతోష్ నాయక్, సర్దార్ నాయక్, సురేందర్ నాయక్, లచ్చిరాం, భాభ్యనాయక్, గంగారాం నాయక్, శంకర్ నాయక్, బలిరామ్ నాయక్ యువతి, యువకులు పాల్గొన్నారు.

ఏఆర్‌పి క్యాంప్‌లో వనభోజనాలు

- పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్, ఏఆర్‌పి క్యాంప్ గ్రామాలలో వన భోజనాలకు వెళ్లారు. గ్రామ శివారులో ఉన్న గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వన భోజనాలకు వెళ్లిన మహిళలు అమ్మవారికి, పస్కరాజులకు ప్రత్యేక నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. పాడిపంటలు పసుపు సంపద వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు.